# షాజేద్ బేగం

మీనూ



ఆ కోఠీలో గానాబజానా నిరాటంకంగా సాగిపోతోంది. కళ్ళు మిరుమిట్లు గొలిపే దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. అర్ధరాత్రి దాటుతున్నా ఆ కోఠీలో చీకటిఛాయలు ఏ మూలల్లోనూ కన్పించడంలేదు. అంతా వెలుగుమయం కాని...కాని... తరతరాలుగా తరగని బానిసత్వపు వారసత్వానికి ప్రతీకగా నిలిచిన...అక్కడి స్త్రీల హృదయాలలో కాగడాతో వెదికిచూసినా...చీకటికోణాలే తప్ప వెలుగుకు నోచుకునే అదృష్ట రేఖలు కన్పించవు.

అక్కడ... ఆకలికి అమ్ముడుపోయిన అబలలు మాత్రమే కాదు. దుర్మార్గుల కబంధహస్తాలలో బందీలుగా మారి పతితలైన స్త్రీమూర్తులూ వున్నారు. సభ్య సమాజంచే వెలివేయబడిన ఆ అపరంజి బొమ్మలు జీవితాన్ని

కోల్పోయి నిట్టూర్చే శవాలుగా మారారు. ఆ నిట్టూర్పుల వలయంలో ఆనందాన్ని వెదుక్కుంటూ బ్రహ్మానందాన్ని పొందే రసికులలో వయోభేదం లేదు.

ఆ కోఠీలో... విశాలమైన హాలు... మెత్తటి కాశ్మీర్ తివాచీతో, గోడలకు అందమైన పడుచుల సోయగాలను వివిధ భంగిమలలో చిత్రీకరించిన నిలువెత్తు పటాలతో చూపరుల దృష్టే ఆకట్టుకుంటోంది. వరండా చుట్టూ వెదురు కర్టెనులు పైకి చుట్టివున్నాయి చల్లటి గాలి సన్నగా వీస్తూ విరజాజులు సౌరభాన్ని వెదజల్లుతున్నాయి

ఆ హాలులో... వాయిద్యాల కనుగుణంగా లయగా అడుగులేస్తున్న ఆమె హృదయం... అందరి ముందూ... నర్తిస్తున్నాననే బాధకు గురవుతున్నా, గత్యంతరం లేదనే సత్యం ఆమె కాలి గజ్జెలను ఘల్లుఘల్లు మనిపిస్తున్నాయి. ఆమె నాట్యం...రసజ్ఞుల హృదయాల్ని ఓలలాడిస్తోంది. వివిధ భంగిమలలో కదులుతూ... అడుగులేస్తూ... సరస ప్రియుల హృదయాలను రంజింపజేస్తోందామె. ఎర్రటి శాటిన్ గరారాపై కుట్టిన చమ్కీలు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. ఆ దుస్తులామె అందానికి హారతు లిస్తున్నట్లున్నాయి.

కొందరు యువతులు... అతిధులకు విస్కీ బాటిల్స్, చిన్నచిన్న ప్లేట్లలో ఫ్రయిడ్ చికెన్, జీడిపప్పు అందజేస్తూ వయ్యారాలు పోతున్నారు.

విరామం లేకుండా నాట్యం చేస్తున్న ఆమెకు అంతా చీకటిగా ప్రపంచమంతా గిర్రున తిరిగిపోతున్నట్లుగా అనిపించి.. మరుక్షణం నేలపై వాలిపోయింది. ఆ హాలులో ఒక్కసారిగా... కేకలు, అరుపులూ మిన్నుముట్టాయి. అదంతా తమ ఆనందానికి అంతరాయం కలిగిందని మాత్రమే।

ఆమె కాలి మువ్వలు... అక్కడి వాతావరణంలో కలిగిన మార్పును నిశ్శబ్దంగా గమనించసాగాయి.

మధిరను సేవిస్తూ...ఆమె అందాన్ని గ్రోలుతూ... నయనానందకరంగా ఆమె నాట్యాన్ని చూస్తూ... ఈ లోకాన్నే మరచిన ఆ నాగరిక మృగాలకు యీ విరామం విసుగునే కల్గించింది. ఏ ఒక్కరి హృదయంలోనూ ఆమె నిస్సహాయతపై కారుణ్యత కలుగలేదు.

అందరూ... ఆ కోఠీని నిర్వహించే మలికాబాయి వైపు... విసుగ్గా చూశారు.

ఆమె క్షమించమన్నట్లుగా వారి వైపు దృష్టిని సారించి, ఆ యువతి వైపు తీవిగా నడచింది.

అప్పటికే ఆ యువతి నింపాదిగా లేచి, చుట్టూ ఓసారి చూసి నిలబడింది. తూలిపోతున్న తనువును అదుపులో తెచ్చుకుంటూ అక్కడ నిలబడలేనట్లుగా ... బరువుగా అడుగులేసుకుంటూ అక్కడినుండి వెళ్ళిపోయిందామె

అమెవైపే వింతగా చూస్తోన్న తక్కిన యువతులను హెచ్చరించి గదిలోకి వెళ్ళిపోయిన ఆమె వెనుకనే వెళ్ళింది మలికాబాయి. అక్కడ ఆమె ...అలసటతో నిస్సత్తువుగా సోఫాపై వాలిపోయి వుంది. అలా ఆమెను చూస్తూనే మలికాబాయి మండిపడింది.

అక్కడ హాలులో గొడవగా వుంది. మలికాబాయి వచ్చిన రసజ్ఞుల వినోదానికి అంతరాయం కలగకుండా మరో యువతిని ఆ హాలులోకి ప్రవేశపెట్టింది. సంగీత వాయిద్యాలు మళ్ళీ విజృంభించాయి కాని... ఆ యువతి అందచందాలు...అక్కడివారికి ఏమాత్రమూ రుచించలేదు.

"బలావో... ఉస్ చంబేలికో! మలికాజీ... జల్దీ బలావో ఉస్ నాజనీకో!"

"మాకు... ఆ సుందరి నాట్యమే కావాలి, ఏదీ ఆ జగన్మోహినీ" అంటూ మళ్ళీ గొడవ మొదలుపెట్టారు.

మలికాబాయికి ఏంచేయాలో తోచలేదు

'మీనా! లే...ఇవుడు నీవు అర్థాంతరంగా అక్కడ్నుంచి వచ్చేస్తే ఎలా? త్వరగా లేచి వెళ్ళు...ఊఁ"

"క్షమించండి! నేనిక... చేయలేను. నాకు చాలా జ్వరంగా వుంది. కళ్ళు తిరుగుతున్నాయి" వేడుకుందామె.

"ఓహో! మళ్ళీ మొదటికే వస్తున్నావన్నమాట! నీ చేత ఎలా చేయించాలో నాకూ తెలుసు" అంటూనే మణిలాల్‌ను పిలిచింది. అతను వచ్చాడు. మణిలాల్ ...ఆ కోఠీలో కావలసిన యువతులను చేరవేస్తూంటాడు అందమైన యువతులను అరబ్ దేశాలకు పంపించి... వ్యాపారం చేసే గూండా అతను. ఖూనీలు చేయడానికి కూడా వెనుకాడని అతని సహాయంతో మలికాబాయి ఆ కోఠీని నిర్వహిస్తోంది. మీనా... మణిలాల్ కబంధహస్తాలలో బందీగా చిక్కిపోయి...అతను నిర్వహించే వ్యాపారంలో ముఖ్యమైన పావుగా మిగిలిపోయిన అబల.

"మణీ! ఈ మీనా మళ్ళీ మొదటికే వచ్చింది. అక్కడ వాళ్ళంతా గొడవ చేస్తున్నారు" చెప్పింది మలికాబాయి.

"ఏం కొరడా తెమ్మంటావా?" క్రోధంగా మీనా వైపు చూశాడు.

మీనా కళ్ళల్లో నీలినీడలు కదలాడాయి. నిస్సహాయత కృంగదీస్తుండగా, చేతులను జోడించి, తానిక చేయలేనని వేడుకుంది మీనా.

మరుక్షణం మణిలాల్ చేతిలోని కొరడా ఆమె శరీరంపై నాట్యం చేయసాగింది. ఆ దెబ్బలకు ఆమె... అతి సుకుమారమైన...సున్నితమైన చర్మం చిట్లిపోతున్నా... లేవలేకపోయింది మీనా.

ఆ గొడవకు నిద్రలేచిన మీనా


కొడుకు. ఎనిమిదేళ్ళ సిద్ధూ... తల్లి పరిస్థితికి తల్లడిల్లిపోయి, ఆమెను చుట్టుకొని బావురుమన్నాడు. మణిలాల్ దయాదాక్షిణ్యాలు లేకుండా ఆ పసివాడిని కొరడాతో కొట్టసాగాడు. మీనూ మాతృహృదయం అది చూడలేకపోయింది.

"ఆగండి! నా సిద్ధూను కొట్టవద్దు... నేను వస్తున్నాను" అంటూ తన శక్తినంతటినీ కూడదీసుకొని లేచి, సిద్ధూను యివతలకు లాగింది. మణిలాల్... మీనూ వెన్నంటే వచ్చి, హాలులోకి ప్రవేశించాడు. అడుగులో అడుగు వేసుకుంటూ...వస్తున్న... ఆమె దివినుండి భువికి దిగివస్తున్న అప్సరసలా, దుఃఖంతో ఎర్రబడిన... ఆమె కనులు ...కలువలుగా...కంది కమిలిపోయిన ఆమె కపోలాలు... గులాబీ రేకలుగా, ఎగసివస్తున్న దుఃఖాన్ని అదిమిపెట్టిన ఆ పెదాలు...లేలేత చిగురుటాకుల్లా... ఆ మధాంధులకు ఆగుపించసాగాయి. కాని ...ఆ కన్నులమాటున దాగిన బాధనూ ఆ గుండెలోతుల్లో అగ్నిశిఖలా జ్వలిస్తున్న వ్యధనూ... అక్కడవున్న ఏ ఒక్క మానవుడూ గ్రహించలేకపోయాడు. గులాబీ కన్యలా నడచి వస్తున్న... ఆ నర్తకి హృదయంలో బడబాగ్ని... ఏ రసికుడి హృదయాన్నీ కదిలించలేకపోయింది. ఆమె కాలిగజ్జెలు ...ఆమె దీనపరిస్థితికి నిశ్శబ్దంగా రోదించాయి. సంగీత వాయిద్యాలు...ఆమెను చూస్తూనే సంగీతాన్నందుకున్నాయి. తబలా, మృదంగం, సన్నాయి తాళాలు వాయించే వారు...ఉన్మాదులై వాయిస్తూ వూగిపోతున్నారు. అంతే... ఆమె కాలిగజ్జెలూ, గాజుల గలగలలూ కలసి ఘల్లుమన్నాయి. రసజ్ఞుల హృదయాలు ఝల్లుమన్నాయి. పతితులూ, భ్రష్టులైన పథవిహీనుల జీవితాలు ఎగరేసిన గాలిపటాలు. పరుల సుఖంకొరకు తన రక్తమాంసాలను వెలకట్టి... శిథిలమైన తన శరీరాన్ని చూసుకుని విలపించే స్త్రీమూర్తి... పతితగానే ఆగుపిస్తుంది. నీడలేని ఆడదాన్ని తన పదునైన కత్తుల్లాంటి మాటలతో యీ సంఘం పొడుస్తూనే వుంటుంది.

అందుకనే... ఆ కొఠీలోకి దురదృష్టవశాన అడుగుబెట్టిన అబలలు బయటకు వెళ్ళటానికి సాహసించరు, ఆత్మవంచనతో... పదిమంది ముందూ నవ్వుతూ, తుళ్ళుతూ బ్రతుకుసాగించే వారికి... యిష్టాయిష్టాల ప్రసక్తివుండదు.

* * *

ఆ రాత్రికి గానాబజానా ముగిసింది. ఎక్కడి వాళ్ళక్కడకు జారుకున్నారు. కొఠీలో దాదాపు... నిశ్శబ్దం తాండవించసాగింది. మీనూ తన గదిలోకి వెళ్ళి....అలంకారాలన్నీ ఒక్కొక్కటిగా తీసివేస్తుండగా... మణి అక్కడకు వచ్చాడు అతన్ని చూస్తూనే నిటారుగా నిలబడిపోయింది మీనూ.




"నీకోసం... దొరబాబు... ఆదే... మౌళి సాహెబ్ ఎదురుచూస్తున్నారు. విద్యున్ డాన్స్ ప్రోగ్రాంలోనే సెటిల్ చేశామనుకో...కాని... మౌళిసాహెబ్ రెండు వేలు యిచ్చారు... ఆయనకు మంచి కంపెనీ కావాలట." మణిలాల్ మాటలకు భగ్గున మండిపడింది మీనూ.

"నాకు యిష్టంలేకపోయినా... పది మంది ముందు మీరు ఎలా గెంతమంటే అలా గెంతాను. నేను చావనైనా చస్తాను గాని... యిలాంటి నీచపు పనులు నేను చేయను. ఇప్పటికే నన్ను నేను శిక్షించుకుంటూ... గడిపేశాను. భర్త మరణంతో ఒంటరిగా మిగిలిపోయి... నా సిద్ధూతో... బ్రతుకుతెరువుకోసం... ప్రయత్నిస్తున్న నన్ను ఉద్యోగ మిప్పిస్తానని చెప్పి... నన్ను యీ ఊబిలోకి దించావు... నిన్ను నమ్మి... ఇంతదూరం వచ్చినందుకు... నేను పతితగా మారాను. నన్నిలా ఉండ నివ్వండి." దృఢంగా పలికిన ఆ స్వరంలో ఆవేదన ప్రతిధ్వనించింది. ఆమెను ఒప్పించడం మణిలాల్‌కు కష్టమైపోయింది.

మణిలాల్... మౌళివి... మర్నాడు రమ్మని... నచ్చజెప్పి పంపించాడు. మలికాబాయి దగ్గరికెళ్ళి... తను చేయాల్సిన పనుల గురించి చర్చించసాగాడు. మణిలాల్. మీనూ విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలనీ... ఇంకా కట్టుదిట్టంగా ఉంచాలనీ హెచ్చరించాడు. అరబ్‌నుండి... కొందరు కన్యలను... రొఖ్ఖమిచ్చి... తమ దేశానికి తీసుకెళ్ళడానికి... వచ్చినట్లు తనకు సమాచార మందినదనీ... ఆ కార్యార్థమై... తాను బిలాస్‌పూర్ వెళ్తున్నట్లూ...

రెండ్రోజులదాకా రావడానికి కుదరదనీ చెప్పి... మరిన్ని జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు మణి.

ఆ బందిఖానా నుండి బయటపడటానికి...తగిన అవకాశం చూస్తున్న మీనూ... యిక ఆలస్యం చేయలేకపోయింది.

కోఠీ అంతా సద్దుమణిగేసరికి...తనకు కావలసిన వస్తువులూ, డబ్బూ, దుస్తులు పెద్ద సూట్‌కేస్‌లో వేసుకుంది. నిద్రపోతున్న సిద్దూను...నెమ్మదిగా లేపింది సిద్దూతో కలసి...మెల్లగా అడుగులేసుకుంటూ వరండా దాటి, ప్రహరీగోడను సమీపించింది. వాచ్‌మేన్ భీముడు ఎక్కువైన మత్తు బరువులో గాఢంగా నిద్రపోతున్నాడు. కోఠీ బయటకు వచ్చిన మీనూ...సువిశాలమైన నల్లటి ఆకాశంలో చిన్నగా తళుక్కుమంటున్న తారలను చూసి...హాయిగా ఊపిరి పీల్చింది. ఇహ ఆలస్యం చేయకూడదు. ఈ నరకకూపం నుండి దూరంగా...ఈ ఛాయలు తనను తాకనంత దూరంగా... తను వెళ్ళిపోవాలి. ఆ నిశ్శబ్ద వాతావరణం... ఆమె సంకల్పానికి బలాన్నిచ్చింది, గబగబా అడుగులు వేసింది. స్టేషను చేరుకొని... రైలెక్కింది. అమావాస్య చీకటిలో...వెలుతురుకై అన్వేషిస్తూ... మీనూ తన చిన్నారి సిద్దూతో పయనమైంది.

*　　*　　*

నిజామాబాద్‌లో రైలు దిగి, ఇక అక్కడ...కోఠీలోని మనుషులు...అ ప్రాంతంలోకి అడుగిడరని... ధైర్యం తెచ్చుకొని... కొంతదూరం బస్సులో ప్రయాణించి, ఆ తర్వాత కాలినడకన. బయల్దేరింది మీనూ.

మీనూ... తనకు రక్షణ యివ్వగల ....చోటుకోసం...అన్వేషిస్తూ...సిద్దూను లాలిస్తూ...గుట్టల్నీ, వంతెనలనూ... దాటుతూ చిన్న పల్లెటూరుని చేరుకుంది.

"అమ్మా! ఇంకెంత దూరం నడవాలి?" కాళ్ళు నెప్పి పుడుతున్నా... ఆకలి, అలసట పోటీపడుతున్నా... కొత్త ప్రపంచంలోకి అడుగిడుతున్న సంతోషం సిద్దూలో కన్పించింది.

"ఇంకెంతో దూరం...నడవనక్కర లేదు. వచ్చేశాం..." అంటూ జన్నేపల్లి క్రాస్‌రోడ్ దాటింది మీనూ.

కొద్ది దూరంలో... మీనూకు చిన్న కొండ...దానిపై ఏదో పాడుపడిన గృహంలా... కన్పించింది. అటువైపుకు నడచింది మీనూ.

సూర్యుడు నడినెత్తిన... అగ్నిగుండంలా వెలుగుతున్నాడు. ఆ కిరణాల దాటికి తట్టుకోలేని కొంగలు బారులుగా తీర్చి కొండవాగు ఒడ్డున నిలబడి సేద తీర్చుకుంటున్నాయి

"అమ్మా! ఆకలేస్తూందే"

తన సంచీలోని... నాలుగు అరటి పళ్ళనుతీసి...రెండు సిద్దూకిచ్చి...తనూ

తిన్నది. ఇద్దరూ వాగునీటిలో మొహం కడుక్కొని... కరువుదీరా మంచినీళ్ళు త్రాగారు. ఆ వాగు ప్రక్కనే చిన్న కొండ వుంది. ఆ కొండ చెరియపై ...ఏదో గుడిలా వుంది.

వాగులో నీళ్ళు... నిశ్చలంగా... స్వచ్ఛంగా వున్నాయి. బారులుతీర్చిన కొంగలనూ, ఎగురుతున్న పక్షులనూ చూస్తూంటే మీనాకు ఎంతో ఆనందం కలిగింది. కళ్ళు విప్పార్చి సువిశాలమైన నీలాకాశాన్ని, స్వేచ్ఛగా ఎగురుతున్న పక్షులనూ తనివిదీరా చూసింది. రాళ్ళ మీదుగా ప్రవహిస్తున్న నీటిలో నీలాకాశపు నీడల్ని చూసిన సిద్ధూ కళ్ళు చిత్రంగా మెరిశాయి.

జైలు గోడలనుండి తప్పించుకు వచ్చిన ఖైదీ హృదయంలా....పంజరం నుండి బయటకు వచ్చిన పక్షి...హాయిగా వినువీధిలో ఎగిరినట్లుగా... మీనా హృదయం స్వేచ్ఛాగీతి నాలాపించింది. పాత జ్ఞాపకాల ఒరవడినుండి దీర్ఘమైన నిట్టూర్పు... ఆమె హృదయంనుండి వెలువడింది.

"సిద్ధూ! ఇక్కడ బాగుంది కదూ?" పలకరించింది మీనా.

"మరి! యిక్కడికి వాళ్ళు... మణి మామయ్య వచ్చేస్తే ఎలా?" తన సందేహాన్ని తల్లిముందుంచాడు సిద్ధూ.

"ఇక్కడికి వాళ్ళెవరూ రారు. నువ్విక్కడ చదువుకుందువుగాని..." అతని భయాలను దూరంచేసింది మీనా.

ఇద్దరూ కలసి కొండపైకి చేరుకున్నారు. ఆ కొండచరియపై పాడుపడిన దేవాలయం. సగం విరిగిపోయిన ధ్వజస్తంభం... సగభాగం కూలిపోయిన పైకప్పు— మీనాకు తన పాత జీవితాన్ని గుర్తుచేశాయి.

నెమ్మదిగా గది తలుపులు తెరచింది.

కిర్రుమని చప్పుడు చేస్తూ, బరువుగా తెరుచుకున్నాయా తలుపులు. లోపల చీకటి తొలగి ద్వారం నుండి వెలుతురు లోపలికి దూసుకువచ్చింది. అప్పటి వరకూ అందులో స్థిరనివాస మేర్పరచుకున్న గబ్బిలాలు...లోపలికి వెలుతురు ప్రవేశించగానే—అటూ ఇటూ ఎగురుకుంటూ బయటకు వెళ్ళిపోయాయి.

తల్లి వెనకనేనుంచున్న సిద్ధూ—తల్లికొంగు పట్టుకొని అపాడు.

"అమ్మా! నాకు భయమేస్తోందే" అన్నాడు.

సిద్ధూకు ధైర్యం చెబుతూ— ఆమె గుడి లోపలికి అడుగుపెట్టింది. నేలంతా దుమ్ము— ధూళితో నిండిపోయివుంది. గోడలు మట్టితో బూజుతో పేరుకొని వున్నాయి.

మీనా విగ్రహంవైపు చూసింది. అక్కడ శివలింగం కన్పించింది. భక్తిగా కళ్ళు మూసుకొని, చేతులు జోడించింది.

"స్వామీ! నీ అనుమతిలేకుండా... నీ పవిత్రమైన ప్రాంగణంలో అడుగు

పెట్టిన యీ ఖరదపువ్వును క్షమించి ఆదరిస్తావు కదూ!" ఆమె కళ్ళల్లో కన్నీటి వరద...ఆశ్రయం లభించి నందుకు హృదయంలో పన్నీటిజల్లు కురిశాయి.

ధూప స్తంభం, హారతిపళ్ళెం మట్టి పేరుకొని వున్నాయి.

పూజాపునస్కారాలు లేక శిథిలమైన గుడిని బాగుచేయాలనిపించింది మీనూకు.

సిద్ధూ...కొండ ప్రక్కగా ప్రవహిస్తున్న వాగునూ...దూరంగా కనిపిస్తున్న పల్లెటూరినీ...కొండల మాటున క్రుంగిపోతున్న సూర్యుణ్ణి చూస్తూ... "అమ్మా! ఇక్కణ్ణుంచి చూడూ...ఎంత బాగా కనిపిస్తుందో?!" అంటూ తల్లిని పిలిచాడు. సిద్ధూ మాటలకు...మీనూ గుడి బయటకువచ్చి, చుట్టూ చూసింది. వాగుకు దగ్గరగా పచ్చటి మైదానం...చుట్టూ పచ్చటి చేలూ...గాలికి బరువుగా వూగుతున్న జొన్న కంకులూ...కొద్ది దూరంలో మలుపు తిరిగిన వాగుమీద వంతెనా...పొలాల నుండి...ఊరి మధ్యకు ఎర్ర కంకర రోడ్డూ...గుడిసెలూ...కుటీరాలూ కనిపించాయి. చుట్టూ సంజె చీకటులు అలుముకుంటున్నాయి.

పొలాలనుండి రైతులూ, కూలీలు గంపల్నీ, గడ్డిమోపులనూ...నాగళ్ళనూ...మోసుకుంటూ వెళ్తున్నారు.

పశువుల మెడలోని గంటలూ, పక్షుల కిలకిలారావాలతో కలసిపోయి ప్రకృతి వినూత్నమైన సంగీతాన్నాలాపిస్తున్నట్లుంది. ఆ పూటకు అరటి పళ్ళనే ఆహారంగా తీసుకున్నారిద్దరూ. క్రమంగా చీకటు లావరించుకున్నాయి.

అప్పటివరకూ ప్రకృతి దృశ్యాలను చూస్తూ...ఆనందించిన సిద్ధూకు...ఆ వంటరితనమూ ... చీకటిలో గాలికి భయంకరంగా ఊగుతున్న దిష్టి బొమ్మలూ భయాన్ని కల్గించాయి.

ఆకాశం వైపు చూశాడు.

చీకటిలో చుక్కలు చిరుదివ్వెలుగా మెరుస్తున్నాయి.

పల్లెలోని గుడిసెలలో లాంతర్లూ, ప్రమిదలూ వెలుగుతున్నాయి.

చీకటిలో కీచురాళ్ళ రొద భయంకరంగా వుంది.

భయంతో గడ్డకట్టుకొని...తల్లి ఒడిలో పడుకున్నాడు సిద్ధూ. అపుడపుడూ వినిపించే కూతలకూ...శబ్దాలకూ ఉలికిపడుతున్నాడు. ఆకాశంలో నక్షత్రాలు మిణుకుమిణుకు మంటున్నాయి.

"అమ్మా! నాకు నిద్రొస్తూంది". సిద్ధూ గొంతు పెగుల్చుకొని అన్నాడు.

"అయితే నిద్రపో..." లాలింపు.

"ఊహూ! భయమేస్తూంది. నువ్వు నిద్రపోతే ఎలా?"

"నాకు నిద్ర రావడంలేదు. నేను నిద్రపోను. నువ్వు నిశ్చితంగా కళ్ళు మూసుకొని నిద్రపో నాన్నా." తల

విమురుతూ నిద్రపుచ్చింది మీనూ. ఆ రాత్రంతా చీకటిలో అలాగే జాగరణం చేస్తూ భవిష్యత్తు నూహించుకుంటూ గడిపింది మీనూ.

మరునాడు ఉదయాన్నే లేచి, సిద్దూను తీసుకొని... కొండవాగులో సిద్దూకు స్నానం చేయించింది. బట్టలు ఉతికి ఆరేసింది. రాళ్ళ గుట్టపై ఆరిన బట్టలను మడత పెట్టి...కొండపైకి చేరుకుంది మీనూ. ముందు గుడిని శుభ్రం చేయాలనే తలంపు రాగానే...సిద్దూను వెంటబెట్టుకొని పల్లె వైపుకు నడచింది

*  *  *

పొలాల్లో పని చేసుకుంటున్న రైతులు...ఒకటి, రెండు మార్లు ఆమె వైపు కుతూహలంగా చూసి, ఆపై తమ తమ పనుల్లో మునిగిపోయారు. పొలాలు దాటి, ఎర్ర కంకర రోడ్డు నెక్కింది మీనూ. కొంత సేపటికి కొండవాగు పై కట్టిన వంతెనను చేరుకుంది. వంతెన దగ్గర ఆగి, కడ్డీలు పట్టుకొని నీళ్ళలోకి వంగి చూస్తున్న సిద్దూను మందలించి, రెక్క పట్టుకొని ముందుకు కదిలింది. రోడ్డు కిరువైపులా చింతచెట్లు... కాయలతో నిండుగా వున్నాయి. పల్లె వచ్చేసింది.

ఆ కొత్త ప్రదేశం ఆమెలో బెరుకునీ, భయాన్నీ కలుగజేసింది. ఇక్కడ తనను గుర్తుపట్టి, తన చరిత్రను వెలికి లాగేవాళ్ళుండరు అని తనకు తానే సమాధానపర్చుకుంది మీనూ.

మీనూ తనకు కావలసిన సరుకులూ, వస్తువులూ కొనుక్కొని మెల్లగా కొండ దారిని పట్టింది. పొలాలమీదుగా నడచుకుంటూ వస్తున్న ఆమెను చిత్రంగా చూశారు రైతుకూలీలు.

ఆమె తలవంచుకొని... సిద్దూతో కలిసి కొండనెక్కి గుడికి చేరింది. గోడల కున్న బూజూ, తలుపులకు పేరుకున్న మట్టిని శుభ్రంగా దులిపింది. గచ్చు అంతా శుభ్రంగా ఊడ్చి, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దింది. శివలింగాన్ని శుభ్రంగా కడిగింది. అగరువొత్తులు వెలిగించింది. మొత్తానికి యీ కార్యక్రమమంతా పూర్తయ్యేసరికి ... సాయంత్రమైంది, రొట్టెలు తిని. కొండవాగులోని స్వచ్ఛమైన నీటిని త్రాగి గుట్టలపై కూర్చున్నారిద్దరూను.

ఎవరో వృద్ధుడు అటువైపుగా వస్తూ కల్పించాడు. ఆ ఊరి గురించి తెలుసుకోవాలన్పించింది మీనూకి. ఆ వ్యక్తి ఆమెను సమీపిస్తూనే అడిగాడు. "ఎవరమ్మా నీవు? చీకటి పడుతూంటే యిక్కడ కూర్చున్నావేమిటి?"

క్షణం ఆలోచించింది మీనూ.

తన గురించి ఉన్నదున్నట్లు చెప్పాలా? వద్దా? అని సంశయిస్తూ తన పేరు చెప్పింది. చెప్పి, ఆ వూరి గురించి ప్రశ్నించింది.

"ఈ వూరిని .... చిక్లి క్యాంప్

అంటారు. ఇక్కడ సుమారుగా రెండు వందల మంది సేద్యం చేసుకుంటూ గడుపుతున్నారు. ఇక యీ వాగును ఫర్లాంగ్ వాగు అంటారు. ప్రస్తుతానికి నీవు ఎక్కడ వుంటున్నావమ్మా ?" అడిగేడతను.


"నేను...ఆ గుడిలో తలదాచుకుంటు న్నాను తాతయ్యగారూ ... ఆ గుడిని చూస్తే ... యిదివరకెపుడో పూజా పునస్కారాలు జరిగినట్లే కన్పిస్తూంది. మరి...యినాడు అది శిథిలమైపోయిం దేమిటి?" కుతూహలంతో అడిగింది.

అయితే ఆ పాడుపడిన గుడిలో పసి పిల్లాడితో ఒంటరిగా గడుపుతున్నావన్న మాట! ఐదేళ్ళ క్రితం వచ్చిన తుఫా నులో ఆ గుడి మంటపం క్రింద చిక్కు కొని పదిహేను మంది మరణించారు. వాళ్ళల్లో పూజారి కుటుంబం కూడా వుంది. ఆ శిథిలాలు తీసి వాళ్ళను బయ టకు తీసి...చేయాల్సిందంతా చేశారు. ఆ తర్వాత ఆ గుడివాయలకు ఎవరూ వెళ్ళలేరు. మరి నువ్వు...? నీకు ఎవరూ లేరా ?" ప్రశ్నించేడతను.

"నా వాళ్ళనూ...ఆ తుఫానే మింగే సింది సిద్ధూతో...నేను ఒంటరిదాన్నై పోయాను. ఎంతో దుఃఖం, విచారం ...నా ఒంటరి జీవితంలో అడుగడు గునా పరామర్శించాయి తాతయ్యగారూ! జీవన పథంలో పడిలేస్తున్న పథికురాల్ని. ఒంటరితనం నన్ను ఓడించింది. నాకు బ్రతుకుతెరువు కల్పిస్తానన్న వ్యక్తి నన్ను మోసంతో...కోఠీలో బందీని చేసి...నన్నో పతితగా మార్చదలచాడు. ఆనాటినుంచి... వెలుగు కోసమై అన్వే షిస్తూ...యీ తీరాన్ని చేరుకున్నాను. ఈశ్వరుని సన్నిధిలో నాకు ఎంతో మన శ్శాంతి లభించింది. ఈ గుడిని...మళ్ళీ పూజాపునస్కారాలతో పునరుద్ధరించి... నా జీవితాన్ని...ఈశ్వరుని సేవకే అంకితం చేయాలనుకుంటున్నాను."

కన్నుల్లో సన్నటి నీటిపొర కదలాడు తుండగా తన మనసులోని...కోరికను వెల్లడించుకుంది మీనూ! అంతా విని పాలోచనగా తలపంకించాడు రామయ్య తాత.

"మీనూ! విన్నా ఆ ఈశ్వరుడు చల్లగా కాపాడాలని కోరుకుంటున్నాను. ఈ...విషయం అంటే...నీ గడచిన జీవితం...యీ పల్లెవాసులకు చెప్ప కుండా ఈ గుడికి పూజారిణిగా వుండు. కాని...నాదొక్కమాట. సాయంత్ర మయ్యేసరికి...మా యింటికి వచ్చేస్తుం డమ్మా. కాదును...ఇంటి దగ్గరే వుంచి...నువ్వు ఉదయాన్నే యిక్కడికి వచ్చి పూజాపునస్కారాలు చేసి ... యింటికి వచ్చేస్తూ వుండు". ఆర్ద్రత నిండిన స్వరంతో చెప్పాడు. అతని అభిమానానికి ... కదలిపోయిన మీనూ. అప్రయత్నంగా రెండు చేతులూ జోడించింది.




"పదమ్మా మీనూ! ఇప్పటికే బాగా చీకటిపడిపోయింది. మాది చిక్లిక్యాంప్ కాదు. ఈ వాగుకు యివతలవైపున్న గుంజిలి గ్రామంలో నేనూ...నా కొడుకూ, కోడలితో వుంటున్నాను." అంటూ ముందుకు దారి తీశాడతను.

వారం రోజుల్లోనే.... తాతయ్య సాయంతో ఆ గుడికో రూపాన్నిచ్చింది మీనూ. సిద్దూ...గుంజిలిలోనే చిన్న బడిలో చదువుకుంటున్నాడు. మీనూ ఊళ్ళోవాళ్ళందరికి సన్నిహితురాలయింది. క్రమేపి మీనూ చిక్లిక్యాంప్ ప్రజలకూ, గుంజిలి గ్రామస్థులకూ గుడి పూజారిణిగా పరిచయమై...వారి ఆదరణకు పాత్రురాలైంది.

ఆమె కులగోత్రాల గురించి ఎవరూ అడగలేదు. ఆమె గతచరిత్ర యేమిటని ఎవరూ ప్రశ్నించలేదు. గుడి గంటలు మళ్లీ మ్రోగసాగాయి. మీనూ...అందరినీ దయతో, ఆత్మీయతతో పలకరిస్తుంది. అందరి దృష్టిలో ఆమె... ఒంటరిగా నిలచిన ఈశ్వరుని...శిథిలమైన గుడినుండి విముక్తి గావించి... అతని దయను అందరిపై కురిపింపజేస్తున్న పూజారిణి.

తృప్తిగా....ప్రశాంతంగా అక్కడ తన జీవనాన్ని కొనసాగిస్తున్న మీనూను విధి వెక్కిరించింది.

ఒక యువతి హత్య కేసులో పట్టుబడి...పోలీసులను తప్పించుకొని తిరుగుతున్న మణిలాల్...ఆ గ్రామాన్ని చేరాడు. గుడిలో...పూజారిణిగా ప్రత్యక్షమైన మీనూని చూసి ఖిన్నుడయ్యాడు. ఆ తర్వాత...ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. మీనూ భయపడింది. అతను...ఆమె భయపడినట్లే గ్రామస్థ

లకు ఆమె చరిత్ర నంతటినీ చెప్పాడు.

“ఒక పతిత...పూజారిణిగా గుడిలో చేరి, అర్చనలు చేయడమా? ఆ దేవాలయమే కాదు...మీ వూరు అంతా నాశనమైపోతుంది” అంటూ వాళ్ళను రెచ్చగొట్టాడు.

అయితే పల్లె ప్రజలు రెండు వర్గాలుగా చీలిపోయారు. కొందరు తమకామె దేవతలా లభించిదనీ, ఆమె పూర్వచరిత్ర తమ కనవసరమనీ నిక్కచ్చిగా చెప్పారు. అయితే మరి కొందరు, ఒక పతితురాలు పూజారిణిగా మారడాన్ని సహించలేకపోయారు.

అలాంటి సమయంలో...భారీవర్షాలు కురిసి వాగుకు దగ్గరలోవున్న గుడి సెలూ, యిళ్ళూ...కొట్టుకుపోయాయి. ఫులాంగ్ వాగు పొంగి...పొలాలన్నీ జలమయమైపోయాయి. వాగు మీద ఉన్న ఆ చిన్న వంతెన కూడా వరదలో కొట్టుకుపోయింది. కంకర రోడ్డు కొట్టుకొనిపోయింది. అయితే ప్రాణ నష్టం సంభవించలేదు. రెండో రోజున వరద నీరంతా తీసేయడంతో పల్లె వాసులు స్థిమితపడ్డారు. కొట్టుకుపోయిన వంతెన స్థానంలో తాత్కాలికంగా నిచ్చెనవేసి...తాటిదూలాలతో కట్టారు. ఆరు రోజుల్లో పల్లెతిరిగి జీవనాన్ని పొందింది.

ఈ అదును చూసుకున్న మణిలాల్...పల్లెవాసులను మరింతగా రెచ్చగొట్టాడు.

“చూశారా? ఆ పూజారిణి మీనూ కారణంగానే మీకు యిలాంటి ఆపద కలిగింది వరదలొచ్చాయి. మీ పంటలు నాశనమయ్యాయి. మీరు కట్టుకున్న యిళ్ళు కూలిపోయాయి. ఇకనైనా నా మాట నమ్మి....ఆ కులటనూ...ఆ భ్రష్టురాలినీ అంతమొందించండి”.

అంతే...ఆ పల్లెవాసులు విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయారు. సూర్యుడు పశ్చిమదిశన క్రుంగిపోతుండగా—గుడి తలుపులు మూసి, కొండదిగి వస్తున్న మీనూను— కర్రలతో — గునపాలతో అడ్డగించారా గ్రామస్తులు.

గుంపుగా వస్తున్న ఆ పల్లెవాసులనూ, వాళ్ళ ముందు నిలబడి తనవైపు హేళనగా చూస్తూ నవ్వుతున్న మణిలాల్‌ను చూసి పరిస్థితిని గ్రహించింది. తనను—నిస్సందేహంగా చంపేస్తారు వాళ్ళు తనకు తప్పించుకునే మార్గంలేదు. అయినా ధైర్యాన్ని కూడదీసుకుంటూ అడిగింది విషయమేమిటని?

“నీవు వేశ్యవు! పతితవు—భ్రష్టురాలివై — ఆలయంలో దేవతార్చన చేయడానికి నీకు ఎంత ధైర్యం?! నీవు కులటవు! ఆలయ పవిత్రతను పాడు చేశావు నీ కారణంగా వూరంతా నాశనమైపోయింది.” ఆ మాటలు ఆమె చెవిని సోకుతుండగానే—కర్రలు పైకి

లేచాయి. గునపాలు ఆమె గుండెల్లో దిగబడ్డాయి: కొండరాళ్ళు ఎర్రటి రక్తంతో సంధ్యారుణిమకు పోటీపడుతుండగా జనం—అక్కన్నుంచికదిలారు.

చీకటిపడినా — మీనా రాలేదేమా అని—తాతయ్య — సిద్దూ కలిసి — అక్కడికి చేరుకున్నారు. అక్కడ కన్పించిన దృశ్యాన్ని చూసి కొయ్యబారిపోయాడు సిద్దూ. తాతయ్య చిత్తరువులా—ఆమెను సమీపించారు. ఆమె తలను తన వొడిలో పెట్టుకొని విలపించాడు. మీనా—వాలిపోతున్న కనురెప్పల్ని—తెరచుకొని చూసింది. "సిద్దూ—! నువ్వు — తాతయ్య ... దగ్గరే వుండిపో నాన్నా—ఇదంతా ... మణి — చేయించాడు. తాతయ్యా— కళ్ళూ—హృదయం—లేని,—యీ... సమాజం...పతనమైన స్త్రీ — ని — గౌర — వంగా ... బ్రత — క ... డానికి— అవకాశం — యివ్వదు — ఈ...పాడు—సమాజపు—పాదాల — కింద —నలిగిపోయినా నా — ఈశ్వరుడి—పాదాల—దగ్గరే — నే— రాలిపోతున్నా—నన్ను—యిక్కడే — స—మా—ధి—చేయండి — సిద్దూ— జాగ్రత్త—శి—వో—హం..."

మీనా తల వాలిపోయింది సూర్యుడు యీ దారుణాన్ని చూడలేక—గట్టిగా - కళ్ళు మూసుకున్నాడు—

ఒంటరిగా నిలిచి — వెక్కి వెక్కి ఏడుస్తున్న సిద్దూనూ—చితిని — పేరుస్తున్న తాతయ్యానూ — చీకటిలో — వెలవెలాబోతూ—సానుభూతిగా పరామర్శించాయి తారలు. ఒంటరివాడైన — ఈశ్వరుని — గుడినుంచి ... గంటలు మూగగా రోదిస్తూ మ్రోగసాగాయి. గుడిలో దీపం ఆరిపోయింది

